


సూపర్ సిక్స్.. అమలు వీక్

తెనాలి: 'సూపర్ సిక్స్ పథకాలు...ఎలా ఉన్నాయ్ తమ్ముళ్లూ...!'ఎన్నికల ప్రచార సభల్లో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అడిగిన ప్రశ్న ఇది. అధికారంలోకి రాగానే ఈ పథకాలన్నీ పక్కాగా అందజేస్తామని కూటమి నేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ప్రతి సభలోనూ హామీనిచ్చారు. తెలుగు తమ్ముళ్లు ఇంటింటికీ వెళ్లి, సూపర్ సిక్స్ హామీల కలర్‌ఫుల్ కరపత్రాలను అందజేశారు. ఒక్కో పథకం కింద ఒనగూరే లబ్ధిని గణాంకాలతో సహా ఏకరువు పెట్టారు. ప్రతి ఓటరునూ నమ్మబలికారు. అన్నదాతా సుఖీభవ పథకం కింద 'ప్రతి రైతుకూ ఏటా రూ.20 ఆర్థిక సహాయం అందజేస్తాం... ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికి తల్లి పేరిట రూ.15 వేల చొప్పున ఇస్తాం. ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితం...నిరుద్యోగ భృతి రూ.3 వేలు చెల్లిస్తాం...18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం'...వంటి హామీలను ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చారు. విస్తృతంగా ప్రచారం చేశారు...

జనాల్ని ఆశల పల్లకీలో ఊరేగించారు.

ఖరీఫ్ సీజనుకు వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి...రైతులకు ఆర్థిక సాయం అందలేదు...పాఠశాలలు పునఃప్రారంభించిన నెలన్నర అవుతున్నా తల్లికి వందనం సాయం ఎప్పుడో తెలీదు. ఇక నిరుద్యోగులు, మహిళలకు నెలకు రూ.1500 పథకాల అతీగతీ లేదు. పైగా సూపర్‌సిక్స్ అంటే భయమేస్తుందని సాక్షాత్తూ చంద్రబాబే అసెంబ్లీ సమావేశాల్లో చెప్పటం చూస్తుంటే, అమలు సాధ్యంకాదని చెప్పకనే చెప్పినట్టుగా భావిస్తున్నారు. గత అయిదేళ్లలో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం, చెప్పింది చెప్పినట్టుగా జాబ్ క్యాలెండరు ప్రకటించి మరీ పథకాలన్నింటిని అమలుచేసి చూపారు. కొత్త ప్రభుత్వం హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్



ప్రతి మహిళకు నెలకు రూ.1,500

నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు

తెనాలి 78,000

నెలకు ఇవ్వాల్సిన సాయం రూ.11.70 కోట్లు



యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి


నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు

తెనాలి 40,000

నెలకు ఇవ్వాల్సిన సాయం రూ.12 కోట్లు

జగన్ పాలనలో అయిదేళ్లలో రైతులకు అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
రైతు భరోసా	తెనాలి	126.03



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందాల్సిన సాయం

నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు

తెనాలి 25,918

ఇవ్వాల్సిన సాయం రూ.51.83 కోట్లు

జగన్ పాలనలో అయిదేళ్లలో తల్లికి అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
అమ్మ ఒడి	తెనాలి	140



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందాల్సిన సాయం

నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు

తెనాలి 45,000

ఇవ్వాల్సిన సాయం రూ. 67.50 కోట్లు

గత ప్రభుత్వంలో భరోసా సకాలంలో అందేది



గత ప్రభుత్వంలో వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా ఏటా మూడు దఫాలుగా సకాలంలో సాగు కోసం డబ్బులు నేరుగా ఖాతాలలోకి వచ్చేవి. ఈ ఏడాది ముగుస్తున్నా కూటమి ప్రభుత్వం ఇస్తామన్న రూ.20 వేల నగదు ఎప్పుడిస్తారో కూడా ప్రకటించలేదు.గత నెలలో కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు వేసింది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వేయలేదు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే రైతులకు సాయం అందించాలి.

– అవుతు రఘురామిరెడ్డి , రైతు, వల్లభాపురం

తల్లికి వందనం ఊసేది?



ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తల్లికి వందనం పేరిట ఎంత మంది పిల్లలు చదువుకుంటున్నా, అందరికి రూ.15 వేలు ఇస్తామని ప్రకటించారు. నాకు ఒక పాప, బాబు. ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్నారు. స్కూల్స్ ప్రారంభమై మూడు నెలలు కావస్తోంది. ప్రభుత్వం తల్లికి వందనం నగదు విడుదల చేస్తే.. ఇద్దరి పిల్లలకు ఫీజులు చెల్లించుకునే వెసులుబాటు కలుగుతుంది.

– రోజా, తెనాలి.

క్లుప్తంగా

పది రోజుల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తెనాలిరూరల్: విద్యుత్ లైన్ల మరమ్మతులు, కొత్త 33కేవీ విద్యుత్ లైను ఏర్పాటు కారణంగా తెనాలి పట్టణంలోని సుందరయ్య నగర్, సుల్తానాబాద్, ఆలపాటినగర్‌లో పది రోజుల పాటు విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ ఎం. లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, ప్రజలు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ముగిసిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

తెనాలి: స్కూల్ కాంప్లెక్స్ రెండురోజుల సమావేశాలు మంగళ, బుధవారాలలో ఎన్‌సీఆర్ కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించినట్టు కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయురాలు పీవీ సుధారాణి తెలియజేశారు. తొలిరోజున యాభై శాతం, చివరిరోజున మరో యాభైశాతం చొప్పున నూరుశాతం ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశాలకు హాజరైనట్టు తెలిపారు. రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయిని పి.అరుణ అజెండాలోని అన్ని అంశాలను ముందుగానే కాంప్లెక్స్ పరిధిలోని అన్ని పాఠశాలలకు విభజించి పంపి, విజయవంతంగా జరిగేలా చూశారని తెలిపారు. సమావేశంలో ప్రైమరీ పాఠశాలల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, సీఆర్ఎం టి.శ్రీదేవి పాల్గొన్నారు తెనాలి మండలంలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ , ప్రైమరీ కాంప్లెక్స్ సమావేశాలను మండల విద్యాశాఖ అధికారులు మేకల లక్ష్మీ నారాయణ, జయంతిబాబు పర్యవేక్షించారు.

ప్రపంచ వెదురు దినోత్సవం



తెనాలి: స్థానిక గెయిటీ థియేటర్ సమీపంలో నివసిస్తున్న మేదర సంఘీయులు బుధవారం ప్రపంచ వెదురు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. వెదురుతో తయారుచేసిన చాటలు, గంపలు, విసన కర్రలులను ఒకచోట ఉంచి కులగురువైన కేతేశ్వరస్వామికి పూల మాల వేసి, కొబ్బరికాయలు కొట్టారు. తమ భక్తి ప్రపత్తులను, తమవృత్తిని గౌరవించుకున్నారు. మేదర సంఘం అధ్యక్షుడు బొరిగె నాగమోహన్, కార్యదర్శి కనికరం రాంబాబు, గౌరవ అధ్యక్షుడు కోడె నాగేశ్వరరావు, కోడె పార్వతి, వీరస్తు రంగారావు, సిరిగిరి కృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ

భట్టిప్రోలు: జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం బుధవారం మండలంలోని వెల్లటూరు, భట్టిప్రోలు పీహెచ్‌సీలు, సబ్ సెంటర్ల పరిధిలో కొనసాగింది. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలోని విద్యార్థులకు డీ వార్మింగ్(ఆల్‌బెండజోల్) మాత్రలు పంపిణీ చేశారు. వైద్యులు సీహెచ్ రామలక్ష్మి మాత్రల వినియోగంపై అవగాహన కల్పించారు.



తెనాలిలో ముగిసిన పవిత్రోత్సవాలు

తెనాలి: పట్టణంలోని సువర్చలాసమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో గత మూడురోజులుగా జరిగిన వార్షిక పవిత్రోత్సవాలు, తిరుప్పావడ సేవా కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. చివరిరోజు విశేష పూజలు, సుదర్శన హోమం, పూర్ణాహుతి, పవిత్ర విసర్జన, తిరుప్పావడ సేవలను ఆలయ వంశపారంపర్య అర్చకుడు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి నేతృత్వంలో వైఖానస ఆగమ పండితులు వేదాంతం నాగమారుతి, నారాయణం గోవర్ధన లక్ష్మీరఘురామ్‌లు ఆగమోక్తముగా జరిపారు. ఆలయ ప్రాంగణంలో సుదర్శన చక్ర ఆకృతిలో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన హోమగుండంలో సుదర్శన హోమాన్ని నిర్వహించారు. అనంతరం 108 కిలోల పులిహారను స్వామి ఎదుట రాశి పోసి వివిధ రకాల పండ్లు, డ్రైఫ్రూట్స్‌తో బాలరాముని ఆకారంతో తీర్చిదిద్దారు. విశేష అర్చనాది కైంకర్యాలను జరిపారు. అర్చకులు, పండితులు చతుర్వేద పారాయణ నిర్వహించి స్వామికి నివేదన చేశారు. అనంతరం భక్తులకు పులిహోర ప్రసాదాన్ని వితరణ గావించారు. పవిత్రోత్సవాల విశిష్టతను భక్తులకు వివరించారు. గత మూడు సంవత్సరాల నుంచి ప్రతి ఏటా భాద్రపద మాసంలో ఆలయంలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సంవత్సరంలో ఒకసారి మాత్రమే జరిగే పవిత్ర ఉత్సవాలు, తిరుప్పావడ సేవలో భక్తులు విశేషంగా పాల్గొనడం సంతోషకరమన్నారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మూడు రోజులుగా ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా జరిగాయన్నారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ, నిఖిల్ శాండిల్య దంపతులు, దాతలు గుడివాడ బాలకృష్ణ, సాంబశివ, నాగేంద్ర సత్యనారాయణ ప్రసాద్ అండ్ బ్రదర్స్, శ్రీపంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం, సంకీర్తన సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.



సుదర్శన హోమం నిర్వహిస్తున్న ఋత్విక్కులు

జాతీయస్థాయి కేరళ ఎన్‌సీసీ ట్రెక్కింగ్ క్యాంప్‌కు తెనాలి విద్యార్థిని

తెనాలి: కేరళలోని ఇడుక్కి జిల్లా కులమావులో ఈనెల 10–17 తేదీల్లో జరిగిన ఆలిండియా ఎన్‌సీసీ ట్రెక్కింగ్ ఎక్స్పెడిషన్, కేరళ ట్రెక్–1 జాతీయస్థాయి క్యాంపుకు స్థానిక రావి సాంబయ్య మున్సిపల్ బాలుర హైస్కూల్ విద్యార్థిని హాజరైంది. అక్కడ తొమ్మిదో తరగతి చదువుతున్న ఎన్‌సీసీ విద్యార్థిని బత్తిని నాగహారిక విజయవంతంగా క్యాంపును పూర్తి చేసుకున్నట్టు హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని షేక్ మౌలాబి వెల్లడించారు. క్యాంపులో కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, అండమాన్ నికోబార్, గోవా, లక్షదీప్ నుంచి ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారని తెలిపారు. ఇలాంటి జాతీయస్థాయి క్యాంపులతో ఎన్‌సీసీ విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం , ప్రకృతిపై అభిమానం, జాతీయ భావం, పట్టుదల, క్రమశిక్షణ, సోదరభావం అలవడతాయని ఎన్‌సీసీ అధికారి పరిశా సర్దార్ అన్నారు. క్యాంప్ సర్టిఫికెట్‌తో పాటు అక్కడ సాంస్కృతిక కార్యక్రమల్లో పాల్గొన్నందుకు ప్రశంసాపత్రాన్ని అందుకున్న నాగహారికను బుధవారం హైస్కూలులో ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు చిలక సుందరరావు, విష్ణుమొలకల నాగేశ్వరరావు, చక్రవర్తి, సలీం బాజీ బాబు, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నాగహారికను అభినందించిన ఉపాధ్యాయులు

మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

చుండూరు(వేమూరు): ప్రజలు ఆర్థిక మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కె.సురేష్ హెచ్చరించారు. చుండూరు మండలంలోని ఆలపాడు గ్రామస్తులకు ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. అనుమతి లేని నిర్వాహకుల వద్ద చీటిపాటలు వేయరాదని, అధిక వడ్డీలు ఆశచూపితే డబ్బులు ఇవ్వవద్దని సూచించారు. రుణ యాప్‌ల ద్వారా అప్పులు తీసుకోరాదని హెచ్చరించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరు చెప్పినా నమ్మవద్దని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రామయ్య, హెడ్ కానిస్టేబుల్ చంద్రరావు పాల్గొన్నారు.



కేఎల్‌యూలో 'ఫ్యూచర్ స్కిల్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'

తాడేపల్లిరూరల్: సాంకేతిక విద్యలో గణనీయమైన పురోగతిని సాధించిన కేఎల్‌యూలో ఫ్యూచర్ స్కిల్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను స్థాపిస్తున్నట్లు కేఎల్‌యూ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ అన్నారు. బుధవారం తాడేపల్లి రూరల్‌పరిధిలోని వడ్డేశ్వరంలోని యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ న్యూఢిల్లీలోని హయ్యత్ రీజెన్సీ హోటల్‌లో జరిగిన సదస్సులో నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో అవగాహన ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. ప్రముఖ గ్లోబల్ పారిశ్రామికవేత్తల సహకారంతో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో ఫ్యూచర్ స్కిల్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. నాలుగు దశాబ్దాలుగా ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, కామర్స్, సైన్సెస్ వంటి విభిన్న రంగాల్లో యూజీ, పీజీ కోర్సులతోపాటు డాక్టోరల్ స్థాయిలో విస్తృతమైన కోర్సులను అందిస్తున్న తమ యూనివర్శిటీ ఈ సహకారం వలన సాంప్రదాయ మౌలిక సదుపాయాలను అధిగమించిందన్నారు. ఫ్యూచర్ స్కిల్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఏఎండీ జిలినిక్స్ వంటి 11 రకాల విభిన్న కేంద్రాలున్నాయని, ఈ కేంద్రాలు ప్రతి సెమిస్టర్‌కు 6000 మంది విద్యార్థులకు భవిష్యత్తు నైపుణ్యాలపైన, ప్రత్యక్షంగా ప్రాజెక్ట్‌లతో పాటు గ్లోబల్ సర్టిఫికేషన్‌లు, ఇంటర్న్‌షిప్‌లతో శిక్షణ ఇస్తాయని అన్నారు. విద్యార్థులను ప్రపంచవ్యాప్తంగా ఉపాధి పొందేలా చేస్తాయని వివరించారు. అవగాహన ఒప్పందాలపైన సంతకాల కార్యక్రమంలో ఏఐసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ టి.జి.సీతారాం, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఉపాధ్యక్షుడు నితిన్ కపూర్, కేంబ్రిడ్జి యూనివర్శిటీ సీఈఓ పీటర్ ఫిలిప్స్, అథ్నోటెక్ సీఈఓ కిరణ్ రాజన్న, కేఎల్‌యూ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారధి వర్మ, స్కిల్ డెవలప్‌మెంట్ స్టూడెంట్ ప్రోగ్రెషన్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ఒప్పంద పత్రాలను అందుకుంటున్న వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ

పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపడాలి



సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలిరూరల్: పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ మరింత మెరుగుపడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సిబ్బందికి సూచించారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 1, 7, 21 వార్డుల్లో బుధవారం ఆయన పర్యటించారు. పారిశుద్ధ్య కార్మికులు, సచివాలయ సిబ్బందితో శానిటేషన్ పనుల విషయమై తగు సూచనలు చేశారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణ సమగ్రంగా జరగాలని, కలెక్షన్ పాయింట్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఆయన వెంట పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా

55 మందికి ఉపాధి అవకాశం



మాట్లాడుతున్న చిన్నవెంకటేశ్వర్లు

తెనాలి: స్థానిక జగ్గడిగుంటపాలెంలోని ప్రభుత్వ ఐటీఐలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. దివీస్ లేబరేటరీస్, ఈక్విక్ డైస్ అండ్ మోల్డ్ ఇంజినీర్లు, టాటా స్టైవ్ వంటి ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలను నిర్వహించారు. హాజరైన 55 మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించినట్టు ఐటీఐ జిల్లా కన్వీనర్/ ప్రిన్సిపాల్ రావి చిన్నవెంకటేశ్వర్లు తెలియజేశారు.

120 మందికి ఉచిత వైద్యపరీక్షలు

కర్లపాలెం: తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలని ఖాజీపాలెం ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ ప్రమీల తెలిపారు. బుధవారం కర్లపాలెం సత్యసాయి గ్రామీణ సేవా సమితిలో ప్రముఖ సమాజ సేవకులు ఆలపాటి రమణారావు సహకారంతో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ ప్రమీల సుమారు 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి గ్రామీణ సేవా సమితి సభ్యులు టి.శ్రీనివాసరావు, ఆలపాటి రమణారావు, జిడుగు వెంకటేశ్వర్లు, సోమరౌతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ



కొల్లూరు: పోటీ పరీక్షలకు ఉపయోగపడే విజయానికి మార్గదర్శి అనే పుస్తకాలను యాక్ట్ (అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్) వ్యవస్థాపకులు ఆళ్లమూడి ప్రభాకరరావు పాఠశాలలు, శాఖా గ్రంథాలయం, జూనియర్ కళాశాలలకు వితరణగా అందజేశారు. రిటైర్ట్ ఐఆర్‌టీఎస్ డాక్టర్. అప్పికట్ల భరతభూషన్ రచించిన పుస్తకాన్ని విద్యార్థి దశ నుంచి చదివితే విద్యార్థులకు పోటీ పరీక్షలు, ముఖ్యంగా సివిల్స్‌లో రాణించడానికి అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతో పుస్తకాలను వితరణగా ఇస్తున్నట్లు యాక్ట్ వ్యవస్థాపకుడు ప్రభాకరరావు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కొమ్ము తులామాన్, యాక్ట్ ప్రతినిధులు అత్తోట ప్రమోద్, అలపర్తి బాబు పాల్గొన్నారు.

వేస్ట్ పిక్కర్స్‌కు నిత్యావసరాల పంపిణీ

తెనాలి: దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం తెనాలిలోని యడ్ల లింగయ్య కాలనీ, నందులపేట, రూరల్ మండలంలోని కఠెవరం, కొలకలూరు గ్రామాల్లో నివసిస్తున్న వేస్ట్ పిక్కర్లకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అల్లాడి దేవకుమార్ చేతుల మీదుగా సుమారు 200 కుటుంబాలకు బియ్యం, కందిపప్పు, నూనె, పంచదార, కారం ప్యాకెట్, మొదలైన పది రకాలను అందజేశారు. స్థానిక న్యాయవాది కేసీ బసవయ్య, స్టేట్ బడ్జెట్ వాచ్ మెంబర్ రమణమూర్తి, గుంటూరు సిటీ కోఆర్డినేటర్లు రమేష్, రవితేజ, రాజశేఖర్, బుజ్జి బాబు స్థానిక అవుట్ డోర్ లెర్నింగ్ సెంటర్ టీచర్లు పాల్గొన్నారు.



పంపిణీ చేసిన నిత్యావసరాలతో దాతలు

మహిళల అభివృద్ధే లక్ష్యం

రేపల్లె రూరల్: మహిళలను అన్ని రంగాలలో ముందుంచటమే మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఎంసీఏ) లక్ష్యమని సంస్థ కార్యదర్శి పరుచూరి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని శ్రీగుత్తికొండ లక్ష్మీనారాయణ కల్యాణ మండపంలో ఎంసీఏ ఆధ్వర్యంలో అమెరికాకు చెందిన ఆంకాలజిస్ట్ డాక్టర్ జగదీష్ సహకారంతో ఎలిప్‌వారిచే డాక్టర్ వేజళ్ల ప్రకాశరావు జ్ఞాపకార్థం మహిళలకు నిర్వహిస్తున్న ఫ్యాషన్ డిజైనింగ్ మూడో బ్యాచ్ ఉచిత శిక్షణ తరగతులను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళల కోసం ఎంసీఏ అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొంది ఆర్థిక పరిపుష్టిని సాధించాలని చెప్పారు. అనంతరం రెండో బ్యాచ్‌లో శిక్షణ పొందిన 22 మంది మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎలిప్ కో–ఆర్డినేటర్ శోభ, ఎంసీఏ సభ్యులు బాపారావు, రమేష్, సత్యప్రసాద్, సాయిప్రసాద్, ట్రైనర్ దీపిక, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

బాలలపై జరుగుతున్న వేధింపులు, వివక్ష అరికట్టాలి

ఫిరంగిపురం ఐసీడీఎస్ సీడీపీఓ పీపీజీ ప్రసూన

దామరపల్లి(తాడికొండ): బాలలపై జరుగుతున్న శారీరక, మానసిక, లైంగిక హింస, వేధింపులు, వివక్షను అరికట్టాలని ఫిరంగిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ పీపీజీ ప్రసూన అన్నారు. తాడికొండ మండలం దామరపల్లి గార్మలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ – క్రాఫ్ ఆధ్వర్యంలో బాలలపై వేధింపులు నివారణ-బాలలను స్వేచ్ఛగా చదువుకోనివ్వడం అనే అంశంపై నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాలల శరీరానికి హాని కలిగించే విధంగా చేయడం, హింసకు గురిచేయడం, బాలల మనసును బాధించే విధంగా హింసించడం, లైంగిక నేరాలకు కఠిన శిక్షలు ఉన్నాయన్నారు. బాలల రక్షణ చట్టం 2012 ప్రకారం కఠిన కారాగార శిక్ష పడే అవకాశం ఉన్నందున బాలల హక్కులపై వారికి అవగాహన కల్పించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు ముందుకు రావాలని సూచించారు. యాక్సెస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్ జిల్లా కో–ఆర్డినేటర్ కె.సమీర్ కుమార్ మాట్లాడుతూ బాలల పట్ల ఎవరైనా హేళనగా మాట్లాడటం, ఒత్తిడి చేయడం వంటివి పాల్పడితే తల్లిదండ్రులు, లేదా ఇతరులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో సర్పంచ్ నల్లిబోయిన సరస్వతి, హెచ్ఎం నాగ మల్లేశ్వరరావు, క్రాఫ్ జిల్లా కో–ఆర్డినేటర్ జి.వెంకట్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రసూన

పోషకాహారం తీసుకోవాలి

బాపట్ల: మహిళలు పోషకాహారం తీసుకోవాలని సీడీపీఓ లక్ష్మీపార్వతి పేర్కొన్నారు. పట్టణంలోని 30వ వార్డు ఇస్లాంపేట, కొత్తపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషకాహార మాసోత్సవంలో సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాశనలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సయ్యద్ కరీమున్నీసా నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీఓ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ పోషకాహారం తీసుకుంటే రక్తహీనత దూరమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ కుమారి తదితరులు పాల్గొన్నారు.